క్లుప్తంగా

రేపు కర్రసాము పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సిలంబమ్ స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ జాతీయ సిలంబమ్ (కర్రసాము) పోటీలు ఆదివారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిష్టోఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 92471 11266 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూనగర్(గుంటూరు): జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ నమోదు కోసం దరఖాస్తు గడువును ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు దరఖాస్తు గడువు పొడిగించామని, ఇక పొడిగింపులు ఉండవని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు జ్ఞాన భూమి పోర్టల్‌లో సంబంధిత ధ్రువపత్రాలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

34,380 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,233 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,380 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,914 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



యువజనోత్సవాల్లో కపిరాజు నాటిక ప్రదర్శన



ప్రస్థానం నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న యువతులు

యువ కళా నైపుణ్యం.. కమనీయం

ఆకట్టుకున్న యువజనోత్సవాలు

ఏఎన్‌యూ(గుంటూరు): రంగరంగుల అలంకరణలు, విచిత్ర వేషధారణలు, విభిన్నమైన పాత్రలతో యువకుల ప్రదర్శనలు వినూత్నంగా సాగాయి. యూనివర్సిటీ స్థాయి యువజనోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం పలు అంశాల్లో ఏఎన్‌యూలో జరిగిన ప్రదర్శనలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక అంశాలు, నైతిక విలువలు జోడిస్తూ సాగిన యువకుల ప్రదర్శనలు ఆద్యంతం ఆలోచింపజేశాయి. స్కిట్, మైమ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గురువారం మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ వోకల్ సోలో (హిందుస్థానీ, కర్ణాటక), లైట్ ఓకల్ సోలో, గ్రూప్ సాంగ్స్, డిబేట్, క్విజ్ పోటీలు, ఫైన్ ఆర్ట్స్ విభాగంలో కొల్లేజ్, క్లే మోడలింగ్, ఇన్‌స్టాలేషన్, మెహందీ అంశాల్లో పోటీలు జరిగాయి. ఈ అంశాల్లో పలు కళాశాలలకు చెందిన యువ కళా బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి.

నేటితో ముగింపు

యువజనోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. చివరి రోజు ఫోక్ ట్రైబల్ డాన్స్, స్కిట్స్ ఎలక్యూషన్, రంగోలి, కార్టూనింగ్, స్పాట్ ఫొటోగ్రఫీ అంశాల్లో పోటీలు జరుగుతాయి. సాయంత్రం జరిగే ముగింపు సభకు వీసీ కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం విశిష్ట అతిథులుగా, బిగ్ బాస్ ఫేమ్, హీరో సయ్యద్ సోహెల్ ర్యాన్, బిగ్ బాస్ ఫేమ్ శ్రీసత్య ప్రత్యేక అతిథులుగా పాల్గొంటారని యువజనోత్సవాల కో-ఆర్డినేటర్ ఎస్.మురళీ మోహన్ తెలిపారు.

రేపు అఖిల భారత యాదవ మహాసభ



గుంటూరు మెడికల్: యాదవులు రాజ్యాధికారంలో ప్రధాన భూమిక పోషించేలా అఖిల భారత యాదవ మహాసభ చైతన్య పరుస్తోందని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 27న అరండల్‌పేటలోని వైన్స్ డీలర్ కల్యాణ మండపంలో అఖిల భారత యాదవ మహాసభ గుంటూరు జోనల్ సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సభకు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల వీర శేఖర్ యాదవ్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాడిపోయిన లక్ష్మీ ప్రసాద్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొల్లికొండ శంకర్‌రావు, పొన్నూరు అధ్యక్షుడు ఆలా సాంబశివరావు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకురాలు చాముండేశ్వరి, రాధాదేవి పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ మూర్తి

కొరిటెపాడు(గుంటూరు): గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను వాడితే అతి తక్కువ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి పేర్కొన్నారు. పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ పథకంపై శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. మూర్తి మాట్లాడుతూ విద్యుత్‌ను ఆదా చేసుకునేందుకు సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మూడు కిలోవాట్ల సూర్య ఫలకాలు ఏర్పాటు చేసుకున్న ప్రతి వినియోగదారునికి ప్రభుత్వం రూ.78 వేలు రాయితీ ఇస్తోందని తెలిపారు. ఇంటి పైకప్పు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసుకొని సొంత వినియోగం తర్వాత మిగులు కరెంట్ ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు మీ పరిధిలోని సెక్షన్ కార్యాలయాలను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సోలార్ ప్యానల్స్ అమర్చుటపై అనుమానాలను నివృత్తి చేయడానికి సోలార్ కాంట్రాక్టర్స్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు గుంటూరు సర్కిల్‌లోని గుంటూరు, తెనాలి డివిజన్లలో 185 మంది పీఎం సూర్యఘర్ పథకం ద్వారా లబ్ధిపొందారని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ సూర్యప్రకాష్, డీఈఈలు సుబ్బరావమ్మ, అక్కల సత్యనారాయణ, పలువురు ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్
- ఏఎన్‌యూలో ముగిసిన కాశ్మీరీ యువ సమ్మేళనం



కాశ్మీరీ యువ సమ్మేళనంలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఏఎన్‌యూ(గుంటూరు): దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఆరురోజుల పాటు జరిగిన నాలుగో కాశ్మీరీ యువ సమ్మేళనం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యకలాపాలు, నైపుణ్య అభివృద్ధి, విద్య, ఉపాధికి దోహదం చేసే అంశాలపై యువత దృష్టి సారించాలన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సాంకేతిక, పారిశ్రామిక పురోగతిని కాశ్మీరీ యువతకు పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. ఏఎన్‌యూ వీసీ గంగాధరావు మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో భాగమైన వివిధ అంశాలపై కార్యశాలలు, క్షేత్ర స్థాయి సందర్శనల ద్వారా కాశ్మీరీ యువతకు జాతీయ ఐక్యత, సమగ్రత వంటి అంశాలపై లోతైన అవగాహన కలుగుతుందన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంపికైన నెహ్రూ యువకేంద్రాలలో గత నాలుగు సంవత్సరాలుగా కాశ్మీరీ యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి అన్ని శాఖల ప్రతినిధులు సహకరించారన్నారు. ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజోమూర్తి, విశాఖపట్నం జిల్లా , నెహ్రూ యువ కేంద్ర అధికారి జి మహేశ్వరరావు, చిత్తూర్ జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి ప్రదీప్ బెహరా పాల్గొన్నారు. సమ్మేళనానికి కాశ్మీర్‌లోని పుల్వామా, బుడ్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, అనంతనాగ్ జిల్లాల నుంచి 132 మంది యువతీ యువకులు హాజరయ్యారు. వారికి అధికారులు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఏఎన్‌యూలో ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ పర్యటన



ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు, ఉన్నతాధికారులతో సమావేశమైన ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల బృందం సభ్యులు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐఆర్ఎఫ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) నిపుణుల బృందం పర్యటన శుక్రవారం ప్రారంభమైంది. కమిటీలో న్యూఢిల్లీ జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ జుబేదా అన్సారి, హైదరాబాద్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, మాజీ సీనియర్ నాక్ అడ్వైజర్ డాక్టర్ రమా కొండపల్లి, కోయంబత్తూర్ అమృత విశ్వ విద్యాపీఠం ఐక్యూఏసీ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంత్ ఆర్.నాయర్ ఉన్నారు. బృందానికి ఉపకులపతి కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ జి.సింహాచలం సాదర స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సమావేశ మందిరంలో యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అకడమిక్ డీన్లు, అధికారులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. సమావేశంలో వర్సిటీ ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణసత్య , ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీకృష్ణ, వర్సిటీ ర్యాంకింగ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.రవి యూనివర్సిటీ సమగ్ర నివేదికలను బృందానికి సమర్పించారు. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, ఇన్నోవేషన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సెల్, సోలార్ సిస్టం, బ్యాటరీ వెహికల్, సేంద్రియ వ్యవసాయం, బొటానికల్ గార్డెన్, కమ్యూనిటీ రేడియో, యూనివర్సిటీ ముద్రిస్తున్న జర్నల్స్, ఇప్పటివరకు యూనివర్సిటీ సాధించిన అంతర్జాతీయ, జాతీయ, ర్యాంకులు, గేట్, ఐఏఎస్, యూజీసీ నెట్ కోర్సులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణ వివరాలను వెల్లడించారు. యూనివర్సిటీ బలోపేతానికి కావలసిన సలహాలు, సూచనలు ఇవ్వాలని నిపుణుల బృందాన్ని కోరారు. నివేదికలు పరిశీలించిన నిపుణుల బృందం యూనివర్సిటీలో విద్యార్థుల ప్రవేశాలు, ఉత్తీర్ణత శాతం, ఉద్యోగాల కల్పన, పరిశోధన ప్రవేశాలు, వాటికి తగినట్లుగా అధ్యాపకుల నియామకాలు, అధ్యాపకులకు కల్పించే పదోన్నతులు, విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతులు క్షుణ్ణంగా పరిశీలించి తగు సలహాలు ఇచ్చారు. వీసీ గంగాధరరావు కమిటీ సభ్యులతో మాట్లాడుతూ ఏఎన్‌యూ అత్యుత్తమమైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించేందుకు దోహదం చేసే అంశాలపై సూచనలు చేయాలని కోరారు. దానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆచార్య కె. రామ్మోహనరావు, ఏఎన్‌యూ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉన్నతాధికారులు, డీన్‌లు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదకర రసాయనాలు వాడొద్దు

కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదకర రసాయనాల వాడకాన్ని వీలైనంత వరకు నివారించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆన్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ అమలుకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు జారీ చేయాలన్నారు. పరిశ్రమల అనుమతులు, సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎంఈజీపీ 2024-25 రుణాలు మంజూరు చేసిన ఎంఎస్ఎంఈలు గ్రౌండ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. తెనాలిలో ఏర్పాటు చేసే దాల్ మిల్ క్లస్టర్‌కు భూసేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. రాయితీలకు సంబంధించి తొమ్మిది క్లయిమ్స్‌కు రూ.93 లక్షలు మంజూరు చేస్తామన్నారు. పరిశ్రమల్లో పని చేసే సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇటీవల చేసిన తనిఖీల్లో కొన్ని పరిశ్రమల్లో యాజమాన్యాల నిర్లక్ష్యం తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఆ పరిశ్రమలకు నోటీసులు పంపాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఆకస్మిక ప్రమాదాలు సంభవిస్తే గోల్డెన్ పీరియడ్ ఐదు నుంచి పది నిమిషాల్లో సిబ్బంది చర్యలు తీసుకునేలా ప్రత్యేక యంత్రాంగాన్ని జిల్లా ఎమర్జెన్సీ ప్లాన్‌లో రూపొందించాలన్నారు. సమావేశంలో జిల్లా విపత్తు నిర్వహణ శాఖ పీఎం లక్ష్మీకుమారి, డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎ.విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలి

ఉపాధి మార్గాలను పెంచేందుకు యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి బ్యాంకర్లు సేకరించిన దరఖాస్తుల్లో అర్హులైనవాటిని ఎంపిక చేసి రుణాలు ఇవ్వాలన్నారు. రుణాలకు బ్యాంకర్లు ష్యూరిటీలు అడగరాదని స్పష్టం చేశారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



ఎం.రవికాంత్
ఆర్టీసీ ఆర్ఎం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నవంబర్ 2 నుంచి కార్తికమాసాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్తిక మాసంలో రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పంచారామాలను దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సామర్లకోట, అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరానికి బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీటితో పాటు త్రిశైవ క్షేత్రాల దర్శనం యాగంటి, శ్రీశైలం, మహానంది ఆలయాలను ఒకే రోజు దర్శించుకునేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి శనివారం, ఆదివారం బస్సులను పంపేందుకు ఆర్టీసీ ఆన్‌లైన్ విధానం ద్వారా రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.. గుంటూరు రీజియన్ పరిధిలో ఐదు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, కార్తిక పౌర్ణమి రోజు అమరావతికి ప్రతి 15 నిముషాలకు ఒక బస్సును తిప్పనున్నామని తెలిపారు.

ఇతర రాష్ట్రాల టూర్లకు ట్యాక్స్ మినహాయింపు

కర్ణాటక, తమిళనాడు, కేరళ టూర్‌కు ట్యాక్స్ మినహాయింపుతోపాటు, శబరిమలకు ఆరు రోజులు, 8 రోజులు, 12 రోజుల టూర్ ప్యాకేజీలను అతి తక్కువ ధరలతో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. గుంటూరు డిపోల నుంచి త్రిశైవ క్షేత్రాలకు ఎక్స్‌ప్రెస్‌కు ఒకొక్కరికి రూ.1080, అల్ట్రాడీలక్స్‌కు రూ.1,380, సూపర్ లగ్జరీకి రూ.1,440గా చార్జి నిర్ణయించామని పేర్కొన్నారు. గుంటూరు నుంచి పంచారామాల దర్శనం కోసం ఎక్స్‌ప్రెస్‌కు రూ.870, అల్ట్రాడీలక్స్‌కు రూ.1,110, లగ్జరీకి రూ.1,160 చార్జి ఉంటుందని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం గుంటూరు డిపో 1, 2 9959225420, 9959225421, తెనాలి డిపో 9959225422, మంగళగిరి డిపో 9959225424, పొన్నూరు డిపో 9959225267ను సంప్రదించాలని సూచించారు.

రైతు సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే

ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: రైతు సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ డే చక్కటి వేదిక అని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ చెప్పారు. శుక్రవారం తుళ్ళూరు ఏపీ సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని తమ సమస్యలను అదనపు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అమరావతిలో భూమి వ్యవహారాలపై 112, ప్రణాళికా విభాగంపై 3, సోషల్ డెవలప్‌మెంట్‌పై 1, భూమి సర్వేకు సంబంధించిన పలు అర్జీలు రాగా అధిక శాతం అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్‌ను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.విశ్వేశ్వరనాయుడు, కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి. భీమారావు, డీసీడీబో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి



లక్ష్మీపురం(గుంటూరు): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు పూనుకుంటుందని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా 37వ మహాసభల ర్యాలీ శుక్రవారం జరిగింది. అనంతరం స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్ ఎదుట ఏఐఎస్ఎఫ్ జెండాను సంఘ మాజీ జిల్లా కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ ఆవిష్కరించారు. మల్లయ్య లింగం భవన్‌లో పాశం వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో శివారెడ్డి మాట్లాడారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలకు సిద్ధపడుతోందని చెప్పారు. సభలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు జంగాల అజయ్ కుమార్, రాధాకృష్ణమూర్తి, కోట మాలాద్రి, అరుణ్ కుమార్, జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్‌జీ, జిల్లా ఆఫీస్ బేరర్స్ శశి, అభిషేక్, శివా, నవ్యశ్రీ, గోపి, నాయకులు డేవిడ్, అమర్నాథ్, సాయి, పవన్, చందు, గౌతమ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆనందశేఖర్‌జయంత్ నృత్య ప్రదర్శన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రోటరీ క్లబ్, ఠాగూర్ థియేటర్ మెమోరియల్ ట్రస్ట్, భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్య కళాకారిణి పద్మశ్రీ డాక్టర్ ఆనందశేఖర్‌జయంత్ నృత్య ప్రదర్శనను ఆదివారం ఏర్పాటు చేసినట్లు ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ థియేటర్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను నృత్య రూపకంలో ఆమె ప్రదర్శించనున్నారని తెలిపారు. ఇంటాక్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభ-2026లో భాగంగా తెలుగు కళ, సాంస్కృతిక రూపాలు సంగీతం, నాట్యం, సాహిత్యం, అవధానం వంటి పక్రియలన్నీ 14 నెలలపాటు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మేలు

విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ నాగభూషణం



ఆధునిక విధానంలో పండిస్తున్న పంటను పరిశీలిస్తున్న డాక్టర్ నాగభూషణం

తెనాలి: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో ఎంతో ప్రయోజనమని వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ పి.నాగభూషణం అభిప్రాయపడ్డారు. కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని శుక్రవారం ఆయన తన బృందంతో కలిసి సందర్శించారు. సంఘ కలెక్షన్ సెంటర్‌ను కోల్డ్ స్టోరేజిని, పంటపొలాల్లో భూసారం తెలుసుకునేందుకు వినియోగిస్తున్న ఆధునిక పరికరాలను పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం పనితీరును, రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమష్టిగా అమలుచేస్తున్న వ్యవసాయ విధానాలు, ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న తీరును ఆయన అభినందించారు. వీరితో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ టి.రమేష్ బాబు, వ్యవసాయ, ఉద్యాన శాస్త్రాల విభాగం సమన్వయకర్త డాక్టర్ టి.నరేష్ పాల్గొన్నారు.